సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



నాడు కాంగ్రెస్.. నేడు బీఆర్ఎస్

ఒకప్పుడు కాంగ్రెస్, టీడీపీలకు కంచుకోటగా ఉన్న జుక్కల్ నియోజకవర్గంలో తెలంగాణ సాధనతో బీఆర్ఎస్ పాగా వేసింది.

- 10లో ▸



అందని పింఛన్

ఆసరా పింఛన్ అందకపోవడంతో అవస్థలు పడుతున్నామని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేశారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
30.0 /14.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం నుంచి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'ఫిట్ ఇండియా' క్విజ్ పోటీలు

కామారెడ్డి అర్బన్: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఆగస్టులో ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన 'ఫిట్ ఇండియా' సందేశాన్ని విద్యార్థులకు చేరవేయడానికి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు యువజన, క్రీడల జిల్లా అధికారి వై దామోదర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్ ఇండియా క్విజ్ విజేతలకు రూ.3కోట్లకు పైగా విలువైన బహుమతులు ఇస్తారని వివరించారు. ఇంగ్లిష్, హిందీ, ఇతర ప్రాంతీయ భాషల్లో నిర్వహించే ఈ క్విజ్‌లో పాల్గొనే వారు ప్రిలిమినరీ రౌండ్ కోసం ఈనెల 31లోగా **https:// fitindia. nta. ac. in/ i/ register/** వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎల్లారెడ్డి ఆస్పత్రిని పరిశీలించిన క్వాలిటీ సెల్ అధికారులు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిని రాష్ట్ర క్వాలిటీ సెల్ అధికారులు విజయలక్ష్మి, జహేరా గురువారం పరిశీలించారు. ఆస్పత్రిలోని లేబర్ రూం, ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఆస్పత్రి ఆవరణ, నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రి భవనం పనులను వారు పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రవీంద్రమోహన్, డాక్టర్ విష్ణు పాల్గొన్నారు.

'అల్పాహారం' ప్రారంభించిన డీఈవో



రాజంపేట: రాజంపేటలోని ప్రాథమిక, బాలికల ఉన్నత పాఠశాలల్లో సీఎం అల్పాహారం కార్యక్రమాన్ని డీఈవో రాజు గురువారం ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 8.45 గంటలకు విద్యార్థులకు మెనూ ప్రకారం టిఫిన్ అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాఠశాల అసెంబ్లీలో పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు అందించారు. ఎంఈవో రామస్వామి, సెక్టోరియల్ అధికారి శ్రీపతి, హెచ్ఎంలు విజయలక్ష్మి, వసంత పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అభివద్ధి చేశాను.. ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే హన్మంత్‌సింధే



మద్నూర్(జుక్కల్): నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన తనను మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని జుక్కల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే కోరారు. డోంగ్లీ మండలంలోని కుర్లా, మదన్‌హిప్పర్గా, దోతి, మారెపల్లి తదితర గ్రామాల్లో గురువారం ఎంపీ బీబీపాటిల్‌తో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి ప్రచారం చేసి తనను గెలిపించాలని సింధే కోరారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలు, సంక్షేమ ఫలాలు కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలని ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. మల్లాపూర్, దోతి గ్రామాల్లో పలువురు దళితబంధు రావడం లేదని బీఆర్ఎస్ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలో గురువారం బీజేపీ అభ్యర్థి అరుణా తార ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలను వివరిస్తూ తనకు ఓటు వేయాలని కోరారు. బీజేపీ మండలాధ్యక్షుడు శివాజీ పటేల్, నాయకులు వినోద్ గౌడ్, మారుతి, సంజీవ్ పటేల్ ఉన్నారు.

బీఆర్ఎస్ దూకుడు!

- ఓ వైపు చేరికలు, మరోవైపు ప్రచారం
- 30న జుక్కల్, బాన్సువాడల్లో సీఎం సభలు
- భారీ జన సమీకరణకు కసరత్తు



జుక్కల్‌లో సీఎం సభకు ఏర్పాట్లు



కామారెడ్డిలో స్పీకర్, విప్, ఎమ్మెల్సీల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వివిధ గ్రామాల ప్రజలు

సాక్షి, కామారెడ్డి: అధికార బీఆర్ఎస్ పార్టీ దూకుడు పెంచింది. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయం సాధించాలన్న లక్ష్యంగా ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను తమవైపు తిప్పుకుంటూనే, మరోవైపు ఎన్నికల ప్రచారాన్ని చేపడుతోంది. ఈ నెల 30న జిల్లాలోని బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలకు ప్లాన్ చేశారు. సీఎం కేసీఆర్ పాల్గొనే ఈ సభలకు భారీ జన సమీకరణ కోసం కసరత్తు చేస్తున్నారు. కామారెడ్డి నియోజక వర్గం నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో బీఆర్ఎస్ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మంత్రి కేటీఆర్ పర్యవేక్షణలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, విప్ గంప గోవర్ధన్ నియోజక వర్గ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి పెద్ద సంఖ్యలో జనాన్ని పార్టీలోకి చేర్పించే కార్యక్రమాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు. ప్రతీ రోజూ వందలాది మందిని రప్పించి గులాబీ కండువా కప్పుతున్నారు. పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌ను పార్టీ కార్యక్రమాలకు వేదికగా ఎంచుకుని అక్కడే అన్ని నిర్వహిస్తున్నారు. వచ్చిన వారికందరికీ భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్య నేతలంతా ఫంక్షన్ హాల్‌లో మకాం వేసి నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోంది. గురువారం కామారెడ్డిలో నిర్వహించిన చేరిక కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డితో పాటు పార్టీ నేతలు ముజీబొద్దీన్, తిర్మల్‌రెడ్డి, నర్సింగ్‌రావ్, నిట్టు వేణుగోపాల్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ప్రచారం

జుక్కల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే హన్మంత్‌సింధే విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజలకు తాను చేసిన సేవలను, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ మరోసారి ఆశీర్వదించాలని కోరుతున్నారు. ఆయన వెంట ఎంపీ బీబీ పాటిల్ పాల్గొంటున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి జోరుగా ప్రచారం చేస్తున్నారు. తాను చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తుందన్న ధీమాతో ఉన్న ఆయనకు కుల సంఘాలు మద్దతు తెలుపుతున్నాయి. నియోజకవర్గంలో ఆయన సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఊళ్లను చుట్టేస్తున్నారు. నేతలను సమన్వయం చేసుకుంటూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. నాలుగు నియోజక వర్గాల్లో పార్టీ నేతలు వివిధ కార్యక్రమాలతో జనంలో తిరుగుతున్నారు. కాంగ్రెస్ ఇప్పటికీ ఒక్క చోట కూడా అభ్యర్థులను ప్రకటించలేదు. బీజేపీ కామారెడ్డి, జుక్కల్ నియోజక వర్గాల్లో అభ్యర్థులుగా వెంకటరమణారెడ్డి, అరుణతార పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయా నియోజక వర్గాల్లో వాళ్లిద్దరు ప్రచారం ముమ్మరం చేశారు. బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజక వర్గాల్లో బీజేపీ అభ్యర్థులు తేలకపోవడంతో అక్కడ ప్రచారం మొదలుకాలేదు.

30న రెండు చోట్ల ప్రజా ఆశీర్వాద సభలు

జిల్లాలోని జుక్కల్, బాన్సువాడ నియోజక వర్గాల్లో ఈ నెల 30న ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహిస్తున్నారు. సభలకు భారీ ఎత్తున జనాన్ని సమీకరించేందుకు బీఆర్ఎస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం కేసీఆర్ రెండు సభల్లో ప్రసంగించనున్నారు. వేలాది మందితో సభలు నిర్వహించడం ద్వారా ప్రచారాన్ని ముమ్మరం చేయాలని భావిస్తున్నారు. వచ్చే నెల 9న సీఎం కేసీఆర్ కామారెడ్డిలో నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, సభలో పాల్గొంటారని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. ఎల్లారెడ్డి నియోజక వర్గంలో సీఎం సభ ఎప్పుడన్నదానిపై ఇంకా క్లారిటీ రాలేదు. రెండో విడతలో ఉంటుందని భావిస్తున్నారు.

ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నుంచి అనుమతి పొందిన ప్రకటనలనే ప్రసారం, ముద్రణ చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతులు తీసుకోకుండా ప్రకటనలను ముద్రిస్తే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లే అవుతుందన్నారు. వాటికి సంబంధించిన ఖర్చును సదరు అభ్యర్థి పేరిట చూపిస్తామన్నారు. నామినేషన్ వరకు ఖర్చును ఆయా పార్టీల ఖాతాలో, నామినేషన్ తర్వాత అభ్యర్థి ఖాతాలో జమ చేస్తారని చెప్పారు. ప్రకటనల విషయంలో అభ్యర్థి సమ్మతించకపోతే సంబంధిత పబ్లిషర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రకటనల వివరాలను నిర్ణీత దరఖాస్తు ఫారం ద్వారా ఎప్పటికప్పుడు సమర్పించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, సినిమా హాళ్లలో, రేడియోలలో ప్రకటనలకు సంబంధించి ముందస్తుగా అనుమతి పొందాలన్నారు. ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, ఇతర ప్రచార సామగ్రిని ముద్రించేటప్పుడు తప్పని సరిగా అనుమతులు పొందాలన్నారు. వాటిపై సంబంధిత ప్రింటర్ పేరు, చిరునామా, ఫోన్ నంబర్ ఉండాలని సూచించారు. అసత్య వార్తల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. న్యూస్ రిపోర్టింగ్‌లో జాగ్రత్తగా ఉండాలన్నారు. నోడల్ అధికారులు కిషన్, సింహరావు, శాంతికుమార్, సతీష్ యాదవ్ పాల్గొన్నారు.

కామారెడ్డి నుంచి పోటీకి సిద్ధం

- కేసీఆర్‌ను గెలిపిస్తే కామారెడ్డిలో రైతుల భూములు ఉండవు
- ప్రజాశాంతి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేఏ పాల్



మాట్లాడుతున్న కేఏ పాల్

సదాశివనగర్: మాస్టర్ ప్లాన్‌లో భాగంగా భూములు కోల్పోతున్న గ్రామాల రైతులు ఒప్పుకుంటే కామారెడ్డిలో కేసీఆర్‌పై పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రజాశాంతి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. గురువారం మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డిలో సమావేశమైన మాస్టర్ ప్లాన్ బాధిత రైతులకు ఆయన మద్దతు తెలిపారు. కేఏ పాల్‌కు భూములు కోల్పోతున్న రైతులు భారీ ఎత్తున స్వాగతం పలికారు. పాల్ మాట్లాడుతూ.. కామారెడ్డి నుంచి కేసీఆర్‌ను గెలిపిస్తే రైతులు తమ భూములపై ఆశలు వదులుకోవాలన్నారు. కేసీఆర్‌ను ఓడించి గుణపాఠం చెప్పాలన్నారు. తాను రైతుల పక్షాన కోర్టులో కేసు వేస్తే కోర్టుకు వెళ్లకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ ఓడిపోయిన తర్వాత జైలు ఊచలు లెక్కపెట్టడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ కుటుంబ పాలనకు స్వస్తి పలకాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్, బీజేపీలో గెలిచిన ఎమ్మెల్యేలు మళ్లీ బీఆర్ఎస్‌లో కలుస్తారన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత వైద్యం, విద్య సదుపాయం కల్పిస్తామన్నారు.

'గంప' ఫుల్ యాక్టివ్!

- సీఎం కేసీఆర్ కోసం సీటు త్యాగం
- కేటీఆర్ భరోసాతో అంతా తానై..
- ఎన్నికల బాధ్యతల్లో నిమగ్నం



సాక్షి, కామారెడ్డి: సీఎం కేసీఆర్ కోసం తన సీటును త్యాగం చేసిన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఎన్నికల బాధ్యతలను నెత్తినేసుకుని చెమటోడుస్తున్నారు. ఎన్నికలకు ఇంకా నెల రోజులపైనే సమయం ఉన్నా, మంత్రి కేటీఆర్ దిశానిర్దేశంతో అన్నీ తానై నడిపిస్తున్నారు. వరుస విజయాలతో కామారెడ్డి నియోజక వర్గంలో తిరుగులేని నేతగా ఎదిగిన గోవర్ధన్ ఈ సారి కూడా పోటీ చేసి విజయం సాధించాలని అనుకున్నారు. అనూహ్యంగా కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో గంప తన సీటును త్యాగం చేశారు. నియోజకవర్గంలో కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు శ్రమించాలని మంత్రి కేటీఆర్ సూచనతో రంగంలోకి దిగిన గంప ఇటీవల చాలా యాక్టివ్ రోల్ ప్లే చేస్తున్నారు. పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ముఖ్య నేతలతో ఇటీవల ప్రగతి భవన్‌లో కేటీఆర్ సమావేశమై దిశానిర్దేశం చేశారు. ముఖ్య నాయకులతో మరోసారి సమావేశం కావాలని భావించారు. ఇంకా తేదీలు ఖరారు కాలేదు. అలాగే సీఎం కేసీఆర్ నియోజకవర్గంలోని కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తున్నారు. దీనిపై గంప నాయకత్వంలో కసరత్తు జరుగుతోంది.

అనుచరుల్లో ఉత్సాహం

కామారెడ్డి నుంచి తిరిగి గంప గోవర్ధన్ పోటీ చేస్తాడని భావించిన ఆయన అనుచరులు సీఎం రానున్న నేపథ్యంలో కొంత నిరాశ చెందారు. తమ నాయకుడి పరిస్థితి ఏమిటన్నదానిపై ఆందోళనకు గురయ్యారు. అయితే భవిష్యత్‌లో మంచి స్థాయిలో ఉంటాడని మంత్రి కేటీఆర్ చెప్పడంతో వారిలో ఆశలు చిగురించాయి. దీనికితోడు గంప గోవర్ధన్ యాక్టివ్ కావడంతో అనుచరులు కూడా ఉత్సాహంగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. గంప నాయకత్వంలో మరింత చురుకుగా పనిచేస్తామని వారు చెబుతున్నారు.

కేటీఆర్ దిశానిర్దేశం

తన సీటు త్యాగం చేసిన గంప గోవర్ధన్ బాధ్యత తాను తీసుకుంటానని, భవిష్యత్‌లో గొప్ప బాధ్యతలు అప్పగిస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. కార్యకర్తల సమావేశంలోనూ అదే విషయం చెప్పారు. దీనికి తోడు మంత్రి కేటీఆర్ నిత్యం గంపతో ఫోన్‌లు మాట్లాడుతూ దిశానిర్దేశం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఎన్నికల పనులన్నీ గంప గోవర్ధన్ చేతుల మీదుగానే నడుస్తున్నాయి. పార్టీ రాష్ట్ర నాయకుడు శేరి సుభాష్‌రెడ్డి కామారెడ్డిలో మకాం వేశారు. ఆయన గంప గోవర్ధన్‌తో కలిసి పర్యవేక్షిస్తున్నారు.

ఎంసీహెచ్‌కు అవార్డుల పంట

- బాన్సువాడ మాతాశిశు ఆస్పత్రికి మూడు జాతీయ అవార్డులు
- ఉత్తమ సేవలకుగాను ప్రకటించిన కేంద్రం



బాన్సువాడ మాతాశిశు ఆస్పత్రి

బాన్సువాడ: బాన్సువాడ మాతాశిశు ఆస్పత్రి(ఎంసీహెచ్)కి అవార్డుల పంట పండింది. ఒకే సారి ఎన్‌క్వాష్, లక్ష్య, ముస్కాన్ అవార్డులను సొంతం చేసుకుంది. ఉత్తమ సేవలకుగాను మూడు అవార్డులను కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జాతీయ స్థాయి బృందం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న సేవలు, పరిశుభ్రత, ఇన్ఫెక్షన్ కంట్రోల్, బయో మెడికల్ వేస్టేజ్, చిన్న పిల్లలకు అందిస్తున్న సేవలపై వివరాలను సేకరించి ఒక్కొక్క విభాగానికి పాయింట్లు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఆస్పత్రిలో ప్రజలకు, చిన్న పిల్లలకు అందుతున్న అత్యుత్తమ సేవలకు గాను 2023 సంవత్సరానికి ముస్కాన్, ఎన్‌క్వాష్(ఎన్‌క్యూఏఎస్), లక్ష్య అవార్డులను గురువారం కేంద్రం ప్రకటించింది.

గతంలోనూ..

జాతీయ నాణ్యత ప్రమాణాలను అనుసరించి అందిస్తున్న వైద్య సేవలకు బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి గతంలో నాలుగు సార్లు కాయకల్ప అవార్డులు, ఒక సారి ఎకో ఫ్రెండ్లీ అవార్డు వచ్చింది. కాయకల్పలో బాన్సువాడ ఆస్పత్రి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలవడం విశేషం. ఇప్పటి వరకు ఐదు సార్లు అవార్డు దక్కించుకున్న ఏకైక ప్రభుత్వ ఆస్పత్రిగా రికార్డు సొంతం చేసుకుంది. 2017–18, 2018–2019 సంవత్సరాలకు గాను రెండో స్థానం, 2020–2021లో మొదటి స్థానం, 2021–2022లో ఎకో ఫ్రెండ్లీలో మొదటి స్థానం, 2022–2023లో రెండో స్థానంలో నిలిచింది.

జాతీయ స్థాయిలో..

బాన్సువాడ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో తల్లి పాలు పట్టే విధానం, తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలకు అందిస్తున్న సేవలపై ఈ ఏడాది ఫిబ్రవరిలో బ్రెస్ట్ ఫీడింగ్ ఆస్పత్రిగా (బీఎఫ్‌హెచ్) అక్రిడేషన్ వరించింది. మాతృత్వ సేవల విశిష్ట పురస్కరమైన లక్ష్య అవార్డును ఆస్పత్రి 2019, 2022లో అందుకుంది. బాన్సువాడ ఎయిడ్స్ కంట్రోల్ కేంద్రం 5 స్టార్ అక్రిడేషన్–2023లో వరుసగా మూడు సార్లు ఎన్‌క్యూఏఎస్ జాతీయ స్థాయి అక్రిడేషన్‌ను సాధించింది.

బాధ్యత పెరిగింది



ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలకు గాను 2023లో ముస్కాన్, లక్ష్య, ఎన్‌క్యూఏఎస్ అవార్డులు రావడం సంతోషంగా ఉంది. ఈ అవార్డుల రాకతో మాపై మరింద బాధ్యత పెరిగింది. ఆస్పత్రి నిర్వహణలో ప్రభుత్వ సహకారం మరువలేనిది. ఆస్పత్రిలో పని చేస్తున్న అన్ని విభాగాల సిబ్బంది సహకారంతోనే ఈ అవార్డులు సాధించాం. రోగులకు నాణ్యమైన సేవలందించేందుకు కృషి చేస్తాం. – శ్రీనివాస్‌ప్రసాద్, సూపరింటెండెంట్, ఎంసీహెచ్

రైతుబంధును అడ్డుకోవడం దుర్మార్గం

- కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారు
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం, చిత్రంలో ప్రభుత్వ విప్ గోవర్ధన్, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: యాసంగి పంటల సాగుకు రైతుబంధు ఇవ్వకుండా అడ్డుకోవాలంటూ కాంగ్రెస్ నాయకులు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం దుర్మార్గమైన చర్య అని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డి పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆయన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుబంధు పథకం కొత్తగా తీసుకువచ్చింది కాదని, ఆన్‌గోయింగ్ స్కీం అన్న విషయాన్ని మరిచిపోయి అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రైతుబంధు వద్దన్న కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రంలో ఏటా కోటి యాభై లక్షల ఎకరాలకు రూ.15 వేల కోట్లు రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయం అందిస్తున్నామని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను కూడా ఆపమంటారేమోనని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులు కూడా దొరకడం లేదని, వాళ్లకు డిపాజిట్లు కూడా రాని పరిస్థితి ఉందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆదర్శంగా నిలిచిందన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని, అక్కడ ఇప్పుడు అవేమీ అమలు కావడం లేదని విమర్శించారు. తెలంగాణలో ఎలాగూ గెలవమని అమలు కానీ హామీలు ఇస్తున్నారన్నారు.

వారికి అభ్యర్థులే దొరకడం లేదు

రాష్ట్రంలోని కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులే దొరకడం లేదని స్పీకర్ విమర్శించారు. బీజేపీకి పదికి మించి స్థానాలు రావని సెంట్రల్ ఇంటెలిజెన్స్ రిపోర్టు ఇచ్చిందన్నారు. ఆ పార్టీల నుంచి పోటీ చేయడానికి కూడా నాయకులు ముందుకు రావడం లేదన్నారు. పొర్లు దండాలు పెట్టినా కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు రావు

సీఎం కేసీఆర్ పోటీ చేయడం కామారెడ్డి నియోజకవర్గ ప్రజల అదృష్టమని, నియోజకవర్గం అన్నింటా అభివృద్ధి చెందుతందని స్పీకర్ పేర్కొన్నారు. సీఎం పోటీ చేస్తుండడతో కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా దక్కే పరిస్థితి లేదన్నారు. కామారెడ్డి ప్రజలు కేసీఆర్‌కు భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, రాష్ట్ర నాయకులు కొమ్ముల తిర్మల్‌రెడ్డి, నిట్టు వేణుగోపాల్‌రావ్, పున్న రాజేశ్వర్, అంజిరెడ్డి, మిన్కూరి రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బల్వంత్ రావ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

కేటీఆర్‌తో వ్యాపారవేత్త సుభాష్ రెడ్డి భేటీ



బీబీపేట: జనగామ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి గురువారం మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌తో పలు విషయాలపై చర్చించారు. ప్రస్తుతం కామారెడ్డి నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నారని, ఆయన గెలుపు కోసం కృషి చేయాలని సుభాష్‌రెడ్డిని మంత్రి కోరారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రతి గ్రా మంలో ప్రచారం చేస్తూ పార్టీ గెలుపునకు కృషి చేశారని, ప్రస్తుతం కూడా అలానే ప్రచారం చేస్తూ పార్టీని ముందుకు తీసుకువెళ్లాలని మంత్రి కేటీఆర్ సుభాష్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు.

'రాజ్యాధికారమే నినాదంగా ముందుకు పోవాలి'



కామారెడ్డి అర్బన్: బీసీలకు రాజ్యాధికారం కోసం బీసీ కులాల ఐక్యతకు కృషి చేయాలని, వచ్చే ఎన్నికల్లో బీసీల కోసం పాటుపడే వారికే ఓటు వేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు అన్నారు. గురువారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా సమావేశం జరిగింది. జిల్లాలో బీసీలకు పెద్ద ఎత్తున సంక్షేమ సంఘంలో చేర్పించడానికి వార్డు స్థాయి నుంచి చైతన్యం చేయాలని అన్నారు. సమావేశంలో కొత్తగా పదవులు పొందిన నేతలకు నియామక పత్రాలు అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు నాగోజీ నారాయణరావు, ప్రతినిధులు ఎం.మోహనాచారి, షేర్ల సాయాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీబీ పాటిల్‌కు తప్పిన ప్రమాదం



నిజాంసాగర్(జుక్కల్): బీఆర్ఎస్ పార్టీ ఎన్నిల ప్రచారానికి వెళ్తున్న జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ రోడ్డు ప్రమాదం నుంచి బయపడ్డారు. గురువారం హైదరాబాద్ నుంచి వస్తూ కామారెడ్డి జిల్లా జుక్కల్ చౌరస్తా మీదుగా డొంగ్లి మండలంలో బీర్ఎస్ ఎన్నికల ప్రచారానికి వెళ్తున్నారు. ఎంపీ వాహనానికి అడ్డంగా మోటార్ సైకిల్ రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశారు. దాంతో ఎంపీ వాహనం పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో ముందు టైర్ పగిలింది. ఎంపీ బీబీపాటిల్‌తో పాటు గన్‌మెన్లు, పీఎ, డ్రైవర్ రోడ్డు ప్రమాదం నుంచి బయటపడ్డారు.

మోపాల్ పీఈటీ సస్పెన్షన్


నిజామాబాద్‌అర్బన్: మోపాల్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన పీఈటీని డీఈవో దుర్గాప్రసాద్ గురువారం సస్పెన్షన్ చేశారు. ప్రవర్తన సరిగా లేదని గ్రామస్తులు ఇటీవల డీఈవోకు ఫిర్యాదు చేయడంతో సస్పెన్షన్ వేసినట్లు డీఈవో పేర్కొన్నారు.

నాడు కాంగ్రెస్.. నేడు బీఆర్ఎస్

- 15వ సారి అసెంబ్లీ ఎన్నిక
- 1978 నుంచి ఎస్సీ రిజర్వుడు
- స్వతంత్ర అభ్యర్థులు మూడు సార్లు, కాంగ్రెస్ ఐదు, టీడీపీ నాలుగు, బీఆర్ఎస్ రెండు సార్లు ప్రాతినిధ్యం
- ఈ ఎన్నికల్లో గెలిచేదెవరో?



జంగ్ తెలంగాణ



హన్మంత్ సింధే



సొదాగర్ గంగారాం



అరుణ తార



బేగరి పండరి



విఠల్‌రెడ్డి

నిజాంసాగర్: కాంగ్రెస్, టీడీపీలకు కంచుకోటగా ఉన్న జుక్కల్ నియోజకవర్గం ప్రత్యేక రాష్ట్ర సాధనతో బీఆర్ఎస్ పాగా వేసింది. ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన జుక్కల్ నియోజకవర్గానికి 1952 నుంచి 2018 వరకు 14 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలకు సరిహద్దు కూడలిగా ఉన్న జుక్కల్ నియోజకవర్గం మూడు రాష్ట్రాల సంప్రదాయం కలిగి ఉంటుంది. కన్నడ, మరాఠి, తెలుగు భాష సంప్రదాయాలతో ఈ ప్రాంత ప్రజల ప్రత్యేకత వేరు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఐదు సార్లు, టీడీపీ నాలుగు సార్లు, స్వతంత్రులు మూడు సార్లు, బీఆర్ఎస్ రెండు సార్లు విజయం సాధించాయి.

కొనసాగుతున్న కారు హవా

2014, 2018లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో కారు హవా కొనసాగుతూ వస్తోంది. 1957లో స్వతంత్ర అభ్యర్థిగా మాధవ్‌రావు, 1962లో కాంగ్రెస్ నుంచి నాగ్‌నాథ్‌పటేల్, 1967లో స్వతంత్ర అభ్యర్థిగా వి. విఠల్‌రెడ్డి, 1972లో స్వతంత్ర అభ్యర్థిగా సామెల్ విఠల్‌రెడ్డి, 1978లో కాంగ్రెస్ నుంచి సొదాగర్ గంగారాం, 1983లో కాంగ్రెస్ నుంచి సొదాగర్ గంగారాం, 1985లో టీడీపీ నుంచి బేగరి పండరి, 1989లో కాంగ్రెస్ నుంచి సొదాగర్ గంగారాం, 1994లో టీడీపీ నుంచి బేగరి పండరి, 1999లో టీడీపీ నుంచి అరుణాతార, 2004లో కాంగ్రెస్ నుంచి సొదాగర్ గంగారాం, 2009లో టీడీపీ నుంచి హన్మంత్‌సింధే, 2014, 2018లో బీఆర్ఎస్ నుంచి హన్మంత్‌సింధే ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. కాగా కాంగ్రెస్ నుంచి సొదాగార్ గంగారాం నాలుగు సార్లు, టీడీపీ నుంచి ఒకసారి, బీఆర్ఎస్ నుంచి రెండు సార్లు హన్మంత్‌సింధే మూడు సార్లు వరుసగా విజయం సాధించారు. నియోజకవర్గం నుంచి వరుసగా మూడు సార్లు హన్మంత్‌సింధే విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు.

1978 నుంచి ఎస్సీ రిజర్వుగా..

సమైక్య రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతంగా పిలిచే జుక్కల్ నియోజకవర్గం 1957 నుంచి 1972 వరకు అసెంబ్లీ ఎన్నికల్లో జనరల్‌గా ఉంది. 1978లో జుక్కల్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు స్థానంగా మారింది. ఎస్సీ రిజర్వు స్థానం ఏర్పడడంతో కాంగ్రెస్, టీడీపీలు ఎన్నికల్లో నువ్వా, నేనా అన్నట్లు పోటీ పడ్డాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కాంగ్రెస్, టీడీపీలకు ఓటర్లు చరమగీతం పలికి కారు గుర్తుకు విజయబావుటను ఎగుర వేశారు. ఎస్సీ రిజర్వు అయినప్పటి నుంచి కాంగ్రెస్ నుంచి సొదాగర్ గంగారాం నాలుగు సార్లు, ఒక సారి బేగరి పండరి, మరో సారి అరుణాతర, మూడు సార్లు హన్మంత్ సింధే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నాలుగు దశాబ్దాల కాలం నుంచి నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు స్థానంగా ఉండటం గమనార్హం.

మంత్రి పదవి దక్కని నియోజకవర్గం

సమైక్య రాష్ట్రంలో 12 సార్లు, తెలంగాణ రాష్ట్రంలో 2 సార్లు నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలకు ఇప్పటి వరకు మంత్రి పదవి దక్కలేదు. ఏడు దశాబ్దాల నుంచి మంత్రి పదవి నియోజకవర్గానికి దక్కకపోవడం గమనార్హం.

జుక్కల్ నుంచి ప్రాతినిధ్యం వహించిన వారు..

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ
1957	మాధవ్‌రావ్	స్వతంత్ర
1962	నాగ్‌నాథ్‌పటేల్	కాంగ్రెస్
1967	వి. విఠల్‌రెడ్డి	స్వతంత్ర
1972	సామెల్ విఠల్‌రెడ్డి	స్వతంత్ర
1978	సొదాగర్ గంగారాం	కాంగ్రెస్
1983	సొదాగర్ గంగారాం	కాంగ్రెస్
1985	బేగరి పండరి	టీడీపీ
1989	సొదాగర్ గంగారాం	కాంగ్రెస్
1994	బేగరి పండరి	టీడీపీ
1999	అరుణ తార	టీడీపీ
2004	సొదాగర్ గంగారాం	కాంగ్రెస్
2009	హన్మంత్ సింధే	టీడీపీ
2014	హన్మంత్ సింధే	బీఆర్ఎస్
2018	హన్మంత్ సింధే	బీఆర్ఎస్

నియోజకవర్గం ఓటర్ల సంఖ్య

పురుషులు :	97,618
మహిళలు :	1,00,269
ఇతరులు :	10
మొత్తం:	1,97,897

'కాంగ్రెసోళ్ల మాటలు విని మోసపోకండి'



బీర్కూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ: మాయ మాటలు చెబుతూ ఇళ్లకు వస్తున్న కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. బీర్కూర్‌లోని మున్నూరు కాపు సంఘంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచన మేరకు సమావేశం ఏర్పాటు చేశామని, ప్రతి కార్యకర్త ఈ 35 రోజులు కష్టపడి పని చేసి పోచారంను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని అన్నారు. రాష్ట్ర స్థాయిలో రూ.11 వేల కోట్లతో బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత పోచారంకే దక్కిందన్నారు. తెలంగాణలోనే అత్యధికంగా డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించిన నియోజకవర్గంగా బాన్సువాడకు పేరుందని అన్నారు. పక్క రాష్ట్రం కర్ణాటకలో ప్రస్తుతం చేతులేత్తేసిన పరిస్థితి దాపురించిందని అన్నారు. నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, అశోక్ తదితరులున్నారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

బాన్సువాడ: ఈ నెల 30న బాన్సువాడలో నిర్వహించే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సూచించారు. గురువారం సభ స్థలాన్ని, వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. బాన్సువాడ పట్టణంలోని వీక్లీ మార్కెట్‌లో నిర్వహించే ఆత్మగౌరవ సభకు సీఎం కేసీఆర్ వస్తున్నారని, నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, మోహన్‌నాయక్, కిరణ్, తదితరులున్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదుతో అధికారులు



బిచ్కుందలో..

నాగిరెడ్డిపేట/ బిచ్కుంద/ నస్రుల్లాబాద్: నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ గేట్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారులు కారులో ఒకరు ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. లక్షా30వేల నగదును గురువారం పట్టుకున్నారు. గుంటూర్ ప్రాంతానికి చెందిన మొగిలీశ్వర్‌రావు తన కారులో నగదును తీసుకుని వెళ్తున్నట్లు తెలిపారు.ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో డబ్బును సీజ్ చేసినట్లు చెప్పారు. దీంతో పాటు జప్తిజాన్కంపల్లి గేట్ వద్ద అధికారులు చేపట్టిన వాహనాల తనిఖీలో నిజామాబాద్ జిల్లా సారం గపూర్‌కు చెందిన ఇలియాస్ తన కారులో తీసుకు వెళ్తున్న రూ. 50 వేల నగదును పట్టుకుని సీజ్ చేశారు. తనిఖీలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వినోద్, రంగారావు తదితరులు ఉన్నారు.

బిచ్కుంద మండల కేంద్రంలోని అయ్యప్ప గుడి వద్ద వాహనాల తనిఖీలో భాగంగా దెగ్లూర్‌కు చెందిన ఒకరి నుంచి రూ. రూ.95,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మురళి పేర్కొన్నారు. ఈ నగదును కామారెడ్డి ట్రెజరీ కార్యాలయంలో జమచేసినట్లు పేర్కొన్నారు.

నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో వాహనాల తనిఖీల్లో ఎండీ సోఫియాన్ నుంచి రూ. 1,26,550 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు. ఈ నగదును ఎఫ్‌డీసీకి అప్పగించినట్లు పేర్కొన్నారు. ఆమె వెంట ఏఎస్సై వెంకట్రావు, అబిద్ బేగ్, జమిదార్, సిబ్బంది ఉన్నారు.

మద్యం స్వాధీనం

పెద్దకొడప్‌గల్: అనుమతి లేకుండా మద్యం విక్రయించేందుకు తీసుకెళ్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కోనా రెడ్డి తెలిపారు. మండల కేంద్రం నుంచి విఠల్‌వాడి తండాకు అధిక ధరకు విక్రయించేందుకు మద్యం తీసుకెళ్తున్న ఒకరిని అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

'ఉపాధి'లో అవకతవకలపై విచారణ

- ఏపీవోపై డీఆర్‌డీఏ పీడీకి రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేసిన ఎంపీపీ గరీబున్నిసాబేగం



విచారణ చేస్తున్న డీఆర్‌డీఏ ప్లాంటేషన్ మేనేజర్

లింగంపేట(ఎల్లారెడ్డి): ఉపాధి హామీ పథకంలో అవకతవకలను పాల్పడుతున్నారని ఏపీవో తులసీరాంపై ఎంపీపీ గరీబున్నిసాబేగం డీఆర్‌డీఏ పీడీ సాయన్నకు రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై గురువారం డీఆర్‌డీఏ ప్లాంటేషన్ మేనేజర్ సురేందర్ లింగంపేట ఎంపీడీవో కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా నర్సరీల్లో మొక్కలు నాటడానికి మండలంలోని 41 జీపీలకు 3,70,000 ప్లాస్టిక్ కవర్లు వచ్చాయి. వీటిలో 12,500 ప్లాస్టిక్ బ్యాగులు మట్టి నింపకుండా ఎంపీడీవో కార్యాలయంలో వదిలేయడంతో వాటిని ఫొటో తీసి డీఆర్‌డీఏ పీడీకి పంపి ఎంపీపీ గరీబున్నిసాబేగం ఫిర్యాదు చేశారు. ఫొటో తీసిన మరుసటి రోజు ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న ప్లాస్టిక్ బ్యాగులను మాయం చేశారు. తన ఆఫీసులో ఉన్న కవర్లు ఎక్కడికి పోయాయని ఆరా తీయగా తానే తీసినట్లు ఏపీవో అంగీకరించారని ఆమె తెలిపారు. అలాగే లింగంపేట మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో మొరం వేయకుండానే రూ.57,884 రికార్డు (ఎఫ్‌టివో) బిల్లు చేసినట్లు విచారణలో తేలిందని విచారణ అధికారి సురేందర్ తెలిపారు. ఈ ఘటనలకు సంబంధించి పూర్తి నివేదికను పీడీకి అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గరీబున్నిసాబేగం, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఏపీవో తులసీరాం, తదితరులు పాల్గొన్నారు.

3న సీఎం కేసీఆర్ సభ



ఆర్మూర్: పట్టణంలో నవంబర్ 3న నిర్వహించనున్న ఎన్నికల ప్రచారసభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతారని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి గురువారం తెలిపారు. పట్టణ శివారులోని ఆలూర్ రోడ్డులో ఉన్న విశాలమైన స్థలంలో సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

కామారెడ్డి క్రైం: కామారెడ్డి రైల్వే స్టేషన్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని గురువారం పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్‌లోని డ్రైవర్స్ కాలనీకి చెందిన జావేద్ ఖాన్ అనే వ్యక్తిని కామారెడ్డి పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు కామారెడ్డిలో పట్టుకుని విచారించారు. అతని వద్ద విక్రయించేందుకు తెచ్చిన 400 గ్రాముల గంజాయి లభించగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో నరేశ్ తెలిపారు.

రైలు ఢీకొని 20 గొర్రెల మృతి

నవీపేట: మిట్టాపూర్ రైల్వే గేటు సమీపంలో గురువారం గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో 20 గొర్రెలు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బాసర రహదారి పక్కన గుట్టపైకి మేత కోసం వెళ్లిన గొర్రెలు తిరుగు ప్రయాణంలో పట్టాలను దాటుతుండగా ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. మృతి చెందిన గొర్రెల విలువ సుమారుగా రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. ఈ విషయమై రైల్వే పోలీసులను వివరణ కోరగా తమకెలాంటి ఫిర్యాదు రాలేదని అన్నారు.

ఎలుగుబంటిని చూసి..



అటవీ ప్రాంతంలో చిక్కుకున్న ముగ్గురు యువకులు

వర్ని: బడాపహాడ్ అటవీ ప్రాంతంలో నమాజ్ పహాడ్ వద్దకు వెళ్లిన యువకులు ఎలుగుబంటిని చూసి అడవిలో చిక్కుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. బుధవారం సాయంత్రం బడాపహాడ్ అటవీ ప్రాంతంలోని నమాజ్ పహాడ్ వద్దకు మేడ్చల్‌కు చెందిన ఆజం ఖాన్, దస్తగిరి మరో యువకుడు దర్శనార్థమై వెళ్లగా మార్గమధ్యలో ఎలుగుబంటి తారసపడగా భయంతో ముగ్గురు చెట్టుపైకి ఎక్కి సెల్‌ఫోన్ సహాయంతో బంధువులకు సమాచారం అందించారు. బుధవారం రాత్రి బంధువులు పోలీసులకు, వక్ఫ్ బోర్డ్ అధికారులకు సమాచారం అందించి అటవీ ప్రాంతంలో గాలించారు. రాత్రి రెండు గంటల ప్రాంతంలో వెతికి పట్టుకున్నారు. గురువారం స్థానికులు, వక్ఫ్ బోర్డు అధికారుల సహాయంతో బడాపహాడ్‌కు చేరుకున్నారు. ఎలుగుబంటిని చూసి భయంతో అల్లాడిపోయినట్లు బాధితులు పేర్కొన్నారు. ఘటనలో ఎవరికీ ఎలాంటి నష్టం జరగలేదు. బడాపహాడ్ అటవీ ప్రాంతంలో వన్య ప్రాణాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్, పోలీసు అధికారులు భక్తులకు సూచించారు.

ఎంత మందికి 'పోడు' పట్టాలిచ్చారో చెప్పాలి

- బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

రామారెడ్డి(ఎల్లారెడ్డి): బీఆర్ఎస్ సర్కార్ పాలనలో ఎంత మందికి పోడు పట్టాలిచ్చారో సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి చెందిన 146 మంది రమణారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ .. నాకు తెలిసి కామారెడ్డి పరిధిలో ఒక్క రైతుకి కూడా పోడు పట్టాలిచ్చినట్లు సమాచారం లేదని, ఎంత మందికి పొడు భూముల పట్టాలు ఇచ్చారో ఓటు అడగానికి వస్తున్న అధికార పార్టీ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లవి ప్రజలను మభ్యపెట్టే హామీలే తప్ప అమలయ్యే పథకాలు కావన్నారు. ప్రజలు ఆలోచించి కమలం పువ్వుకి ఓటు వేసి బీజేపీని గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

కామారెడ్డి క్రైం/భిక్కనూరు/రామారెడ్డి: జిల్లా కేంద్రంలోని శుభం కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో గురువారం బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు జరిగాయి. భిక్కనూర్ మండలం భాగిర్తిపల్లి, మాచారెడ్డి మండలం అక్కాపూర్, కొత్తపల్లి, సోమార్‌పేట్, దోమకొండ మండల అంబారీపేట్, రామారెడ్డి మండలం అన్నారం గ్రామాలకు చెందిన సుమారు 400 మంది కాంగ్రెస్, బీజేపీలకు రాజీనామా చేసి అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డిల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరేందుకు వచ్చిన వారికి గులాబీ కండువాలు వేసి పోచారం, గంప గోవర్ధన్, సుభాష్ రెడ్డిలు ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, ఆహార భద్రతా కమిషన్ మాజీ చైర్మెన్ కొమ్ముల తిర్మల్ రెడ్డి, మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగ్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, సీనియర్ నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు, నాయకులు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

వర్ని: మండలంలోని పాత వర్ని గ్రామానికి చెందిన మంచిప్ప సాయికుమార్(22) దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని గాంధీ నగర్‌లో దుర్గామాత విగ్రహాన్ని గ్రామ చెరువులో గురువారం ఉదయం నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు సాయికుమార్ నీటిలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్కూటీని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు..

బాల్కొండ: మెండోరా మండలం చాకిర్యాల్ వద్ద జాతీయ రహదారిపై స్కూటీని వెనుక నుంచి లారీ వేగంగా ఢీకొన్న ఘటనలో మెండోరా మండలం వెల్కటూర్ తండాకు చెందిన బానోత్ అనిల్(25) మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ గురువారం తెలిపారు. అనిల్ స్కూటీపై నిర్మల్ వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో అనిల్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ ఆపకుండ వెళ్లడంతో గంజాల్ టోల్ ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హార్వెస్టర్ కింద పడి మరొకరు..

మోపాల్: మండలంలోని సింగంపల్లిలో హార్వెస్టర్ కింద పడి రైతు సంతాజీవెంకటి(49) మృతిచెందినట్లు ఎస్సై గంగాధర్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటి తాను కౌలు చేస్తున్న పొలంలో మూడు రోజుల క్రితం హార్వెస్టర్‌తో పనులు చేయిస్తుండగా అది వెంకటిపై పడిపోయింది. ఈ ఘటనలో వెంకటి అక్కడికక్కడే మృతి చెందగా ఈ విషయాన్ని డ్రైవర్ ఎవరికీ చెప్పలేదు. కుటుంబ సభ్యులు కౌలు చేస్తున్న పొలంలో గురువారం పరిశీలించగా బురదలో కూరుకుపోయి మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కోడలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



వెంకటి(ఫైల్)

చికిత్స పొందుతూ యువకుడు..

లింగంపేట: బాణాపూర్‌కు చెందిన ముదాం రవీందర్(32) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు.. రవీందర్ కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై వారం రోజుల క్రితం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు కామారెడ్డికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.



రవీందర్

8 మంది బైండోవర్

బోధన్‌రూరల్: బోధన్, సాలూర మండలాల్లో పాత నేర చరిత్ర కలిగిన 8 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఏఎస్సై రవీందర్ గురువారం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గత ఎన్నికల్లో కేసులు కలిగిన, రౌడీ షీటర్లను బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.